



# జీవనది

**- కొత్తపల్లి ఉదయబాబు**

"ఎంతసేపూ ఉద్యోగం- వృత్తి ధర్మమూయేనా? నలభై అయిదేళ్ళు దాటాయి. యికనైనా ఆధ్యాత్మిక తత్వం అలవాటు చేసుకుని రోజూ సంధ్యావందనం చేయి నాయనా! సూర్య నమస్కారాలు చేశావంటే యోగా చేసినట్టే. ఒక్క పది నిముషాలపాటు శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేశావంటే నీ టెన్షన్సన్నీ తగ్గి మానసిక శాంతి కలుగుతుంది. తద్వారా ఆరోగ్యం బాగుంటుంది. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడివి. నువు ఎంత కష్టపడి బోధిస్తావో నాకు తెలుసు. నీ ఆదాయమంతా నీ కష్టార్జితం అంటే నువు చెమటోడ్చి సంపాదించిన డబ్బు. దానిని దేవునికి వెచ్చించే కన్నా మానవత్వాన్ని చూపించడానికి వెచ్చించు. నీ జన్మ ధన్యమవుతుంది! చాదస్తంతో చెబుతున్నాననుకోకు. అర్థం అయిందా!"

యింట్లో ఉన్నన్ని రోజులూ అమ్మ నా నరాలలోకి యింకిపోయేలా యింజెక్ట్ చేసిన మాటలను వేదవాక్కుగా భావించి అనుసరిస్తూనే కార్తీక మాసంలో యాత్రకు బయల్దేరాను కుటుంబంతో సహా.

యికపై ప్రతీ కార్తీక మాసంలో 'ఒక రోజు యాత్ర' చేద్దామన్న సంకల్పం. టాక్సీ మాట్లాడుకుని బయల్దేరాం ఉదయం అయిదింటికల్లా.

దారిలో కావలసిన తినుబండారాలన్నీ ఓపికగా ఒంటి గంటకే లేచి సిద్ధం చేసారు నా భార్య ప్రభావతి, కుమార్తె గాయత్రి.

అనుకూలవతి అయిన భార్య, వినయ విధేయతలు కలిగిన పిల్లలు కలిగి ఉండటమే నాకు భగవంతుడు ప్రసాదించిన వరం.

మా యాత్ర పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి దర్శనంతో ప్రారంభమైంది. దారిలో పెనుగొండ కన్యకాపరమేశ్వరీ క్షేత్రం, లక్ష్మీనారాయణుని కోవెల; అష్టలక్ష్మి దేవాలయం దర్శించడం జరిగింది.

రావులపాలెం మీదుగా ద్వారపూడి కోవెల దర్శించుకుని; ద్రాక్షారామంలో అభిషేకం చేయించుకుని కోటిపల్లి క్షేత్రానికి చేరుకున్నాం.

మధ్యాహ్నం పన్నెండున్నర గంటలయింది.

కోటిపల్లి దేవాలయం మూసివేశారు. మళ్ళీ రెండు గంటలకు తెరుస్తారట.

గుడికి కొద్ది దూరంలో గోదావరి గలగలా ప్రవహిస్తూంది.

స్వామిని దర్శించుకునే వెళ్దాం అని నిర్ణయించుకున్నాం.

అందుచేత కారు మళ్ళించుకుని గోదావరి తీరానికి చేరుకున్నాం.

అక్కడ అప్పటికే మాలా చేరుకున్న ప్రయాణీకులు రావి చెట్టు చుట్టూ కట్టిన అతి విశాలమైన గట్టు మీద సేద తీరుతున్నారు. కొందరు తింటున్నారు. యువకులు గోదారి తల్లి ఒడిలో జలకాలాడుతున్నారు. పెద్దలు హెచ్చరిస్తున్నారు.

చంటి పిల్లలు గంతులేస్తున్నారు.

గోదావరి మీద నుంచి రివ్వున వీస్తున్న చల్లని గాలులు ఆ మధ్యాహ్న సమయంలో ప్రాణంపోసే అమృత ధారల్లా స్పృశిస్తున్నాయి.

శరీరంతోపాటు మనసు ఆహ్లాదంతో తేలిపోతోంది.

అంతరంగం తెలియని ఆనందంతో పరవశమై ఒక అద్భుత అనుభూతిని ఆవిష్కరిస్తోంది.

శ్రీమతి; పిల్లలిద్దరూ గట్టుమీద కూర్చున్నారు.

నేను మెట్లు దిగి రేవులోకి వచ్చాను.

అప్పటికే కొందరు కుర్రాళ్ళు అటూ యిటూ యీదుతున్నారు.

పదేళ్ళు; ఎనిమిదేళ్ళు ఉన్న యిద్దరు పిల్లల మాత్రం నీళ్ళల్లోంచి బయటకు వచ్చి నాకేసి ఆశగా చూస్తున్నారు- తెల్లని కళ్ళతో.

నల్లని నలుపుతో, ఒకపూట తింటే మరోపూట తినని వాళ్ళలా ఉన్నారు.

పెద్దాడికి ముందు రెండు పళ్ళూ ఊడిపోయాయి. చిన్నవాడు గుండుతో ఉన్నాడు. వాళ్ళ ఒంటి మీద ఉన్న నీలం రంగు నిక్కరు తన ఉనికిని నామమాత్రంగా మిగుల్చుకుని శిథిలావస్థలో ఉంది.

ఎండ పడిన వారి శరీరపు ఛాయ వింత కాంతితో మెరుస్తోంది.

మందపల్లి శనీశ్వరస్వామి వారసుల్లా నన్ను పరికించి నా చేతుల వంక చూస్తుంటే- "ఏం కావాలి?" అనడిగాను.

"గోదాట్లో డబ్బులెయ్యరా?" అడిగాడు పెద్దాడు.

"ఆళ్ళు అలాగే అడుగుతారు మీరు వెయ్యకండి మాష్టారూ!" అని యీదుతున్న వారిలో ఒకడు అరిచాడు.

"వేస్తే ఏం చేస్తారు?"

"ఏసి సూడండి" అన్నాడు చిన్నాడు.

నాకు మళ్ళీ అమ్మ జ్ఞాపకం వచ్చింది.

చిన్నతనంలో రాజమండ్రి పిన్నిగారింటికి రెల్లో వచ్చినప్పుడల్లా నాకు చిల్లర నాణెం యిచ్చి గోదావరిలో వెయ్యమనేది. తను వేసేది.

ఆ తరువాత కనులు మూసి నమస్కరించుకుని, నాచేత నమస్కారం పెట్టించేది.

"ఎందుకలా చెయ్యాలమ్మా!" అని అడిగాను ఓసారి.

"ఆ తల్లి జీవనది. జీవనది అంటే రుజువుతోనూ కాలంతోనూ సంబంధం లేకుండా ప్రవహించేది- ఎండిపోనిది. ఆ తల్లి దయవల్లే మనకు అన్ని రకాల పంటలూ పండుతున్నాయి. ఆ పంటలు తినే మనం బ్రతుకుతున్నాం. మనకు జీవనాధారమైన ఆ తల్లికి నమస్కరించుకోవాలా వద్దా?"

నేను మరి మాట్లాడలేదు.

నేను ఉద్యోగం సంపాదించాక గోదారి మీద ప్రయాణంలో చిల్లర వేయడం మానేశాను. నమస్కారం చేసుకుంటూ అమ్మ చెప్పినట్టుగా ప్రార్థించడం అలవాటు చేసుకున్నాను.

రైల్లో ప్రయాణీకులు చిల్లర నాణెం విసిరినపుడు అది నేరుగా గోదారి నీళ్ళలో పడక బ్రిడ్జికి తగిలి దాని మీదే పడిపోయేది. వాళ్ళు చిన్నబుచ్చుకునేవారు.

"నీకు వెయ్యడం రాదు" అని పెద్దలు పిల్లల్ని కేకలేసేవారు.

"చిల్లర వెయ్యమని ఆ తల్లి అడగలేదు కదా?" అన్నానోసారి.

"నువు అడగలేదని ఆ తల్లి నీరియ్యడం మానేసిందా?" అందొకావిడ ఎదురు ప్రశ్నవేసి.

మరి మాట్లాడలేదు నేను.

అప్పటి నుంచి నాణాలు వేసే వారిని చూసి నవ్వుకోవడం తప్ప సలహాలు యివ్వడం మానుకున్నాను.

ఆ సందర్భమే గుర్తుకు వచ్చింది నాకిపుడు.

జేబులోంచి చిల్లర నాణెం తీసి విసిరాను.

సరిగ్గా నాణెం పడినచోటుకు రెప్పపాటు కాలంలో దూకేశాడు పెద్దాడు.

నా గుండె గుబేలు మంది.

దానికి కారణం రెండు నిముషాలైనా వాడు పైకి రాకపోవడం.

అయోమయంగా చూస్తున్న నాకు గొంతు తడారిపోతున్నంతలో ఒక్కసారిగా నీటి మీదకు తేలాడు వాడు.

వాడి అరచేతిలో తడిగా ఉన్న నాణెంపై సూర్య కాంతి పడి నా కళ్ళల్లోకి పరావర్తనం చెందింది.

ఆ నాణాన్ని నాకిస్తాడనుకున్నాను.

వాడు నీళ్ల ఉమ్మేస్తూ తన జేబులో వేసుకున్నాడు.

"ఆడికేశారు. మరి నాకూ ఎయ్యరా?" అడిగాడు చిన్నాడు.

"నీకూ యీవిద్యవచ్చా?" అడిగాను.

"ఓ... ఎయ్యండి బాబూ!" అన్నాడు జాలిగా. మరో రూపాయి నాణెం వేశాను.

వాడూ నాణెం పడ్డచోటే సరిగ్గా దూకేశాడు.

ఈసారి నేను కంగారు పడలేదు.

వాడూ అలాగే నాణెంతో పైకొచ్చాడు. దాన్ని జేబులో వేసుకున్నాడు.

"యిప్పటికి ఎంత పోగయ్యిందిరా?" అడిగాడు పెద్దాడు తన జేబులో ఉన్న గుడ్డముక్కను కట్టిన చిల్లర నాణాలు లెక్కబెడుతూ.

"ముప్పయ్యొనిమిది! మరి నీకు?" అన్నాడు చిన్నాడు.

"నలభై రెండు" అన్నాడు పెద్దాడు.

"అయ్‌గోరూ! అమ్మగారిసేత; పాపలసేత కూడా ఏయించండి!" అన్నాడు జాలిగా.

"మీరిద్దరూ చదువుకున్నారా?" అడిగాను.

"ఆడు సదూకుంటన్నాడండి. నేను ఒకటి సదూకుంటన్నాను". చిన్నవాడి సమాధానం.

'మరి ఈవేళ స్కూలు ఉందిగా. వెళ్ళలేదేం?" అన్న నా మాట పూర్తికాకుండానే "అదిగో మాష్టారూ! అక్కడున్నారు మీ శిష్యులు వెళ్ళి పట్టుకోండి" అన్నమాటలు వినబడి వెనక్కు తిరిగాను.

"ఒరేయ్ వెధవల్లారా? ఎక్కడ తగలడ్డార్రా! మీ చదువులు కాదు గదా మా ప్రాణాలు తీసేస్తున్నార్రా! మీకోసం మధ్యాహ్న భోజనం రెడీగా ఉంది. దయచేయండి!" అంటూ మెట్లు హడావుడిగా దిగబోతూ తడబడి పడబోయి తమాయించుకున్న పంచికట్టు మాష్టారొకాయన మా దగ్గరగా వచ్చాడు.

"ఈ యేల మా కోటా యింకా పూర్తికాలేదు సారూ! మా యన్నం మీకాడే ఉంచండి- లేదంటే మీరు మాకెట్టలేదని పెద్దసారొచ్చినపుడు సెప్తాం." అన్నాడు చిన్నాడు.

"హారి మీ అసాధ్యం కూలా! చివరికి బ్లాక్ మెయిల్‌కి దిగార్రా! యీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేయడంకన్నా అడుక్కు తినడం మేలనుకోండి మాష్టారూ!" అన్నాడతను నన్ను ఉద్దేశించి. నేను అతన్ని గుర్తుపట్టాను.

"మీ పేరు శంకరమేనా? మీరు మచిలీపట్నం లోనే బి.యిడి. చేశారు కదూ!" అన్నాను.

"అవును మీరు... మీరు రాజశేఖరం కదూ! అరే! ఎంతకాలమైంది నిన్ను చూసి! యింతకీ ఎక్కడ ఏం చేస్తున్నావు?" అని ఉభయకుశలోపరి పూర్తయ్యాక పావుగంట మాట్లాడుకున్నాం. ఫోన్ నంబర్లు పరస్పరం మార్చుకున్నాక-



ఏ పని సేద్దావన్నా ఎవరూ నన్ను పనిలోకి ఎట్టుకోవట్లేదు బాబు. పైగా అదేదో మాయదారి జొరం వచ్చి కృంగదీస్తావుంటే మంచంలో పడి ఉంటన్నాను. ఆ యిద్దరు ఎదవలకి ఓ అచ్చరం ముక్కొత్తే ఏ సిన్న పని సేసుకుని బతుకుతారని ఆశ

"యింక వెళతానయ్యా శేఖరం. అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండు. నాకున్న పిల్లకాయల్లో వీళ్ళు పిడుగులు. వీళ్ళ నాన్న ఎయిడ్స్‌తో పోయాడు. వీళ్ళ అమ్మ ఎయిడ్స్ పేషంట్. మంచంలో పడి ఉంది. వీరిద్దరూ ఎయిడ్స్ పేషంట్లే.

యిలా డబ్బు సంపాదించి ఆ తల్లికి వైద్యం చేయిద్దామని వారి ఉద్దేశం. అందుకే వాళ్ళంటే నాకు కోపం రాదు. గుండెల నిండా జాలిఉంది. బడికి రాకపోయినా మేనేజ్ చేస్తూ ఏదో నాకు తోచిన సహాయం చేస్తుంటాను. వస్తానోయ్ మరి! ఏమర్రా! మీరు వచ్చేదేమయినా ఉందా?" అడిగారాయన వారినుద్దేశించి.

"అక్కడ భోజనాలు పూర్తయ్యేపాటికి వచ్చేత్తాం సార్!" అన్నాడు పెద్దవాడు.

"వస్తానోయ్ శేఖరం" అంటూ పంచె వెనుక దోపుకుంటూ వెళ్ళిపోయాడు శంకరం.

"యిదిగో పిల్లలూ యిలా రండి!" అంటూ వారిని పిలిచాను దగ్గరగా.

వాళ్ళ మాష్టారు నా స్నేహితుడని తెలిసేసరికి వారికీ నా మీద భయం పుట్టుకొచ్చినట్టుంది.

"సెప్పండయ్యా!" అన్నాడు వినయంగా చేతులు కట్టుకుని. అది చూసి రెండోవాడు కూడా చేతులు కట్టుకున్నాడు.

"మీ అమ్మ దగ్గరకు నన్ను తీసుకెళ్తారా!" అడిగాను.

"ఓ! రండి సారూ!" అని చిన్నవాడు చెయి పట్టుకున్నాడు చనువుగా.

వాళ్ళను తీసుకుని గాయత్రి దగ్గరగా వచ్చిన నేను నా హేండ్‌బేగ్ అడిగి తీసుకుని "గుడి తెరిచే లోపు వచ్చేస్తాను గాయత్రి! యిక్కడే ఉండండి. కంగారు పడకండి!" అని పెద్దవాడిని యిల్లు చూపమని అనుసరించాను.

వారి యిల్లు గుడి వెనుక సందు చివర ఒక పూరి పాక.

మంచంలో జవసత్వాలు కోల్పోయిన శరీరంతో యిరవైలోనే అరవై వచ్చినట్టుంది వారి తల్లి కుక్కిన మంచంలో.

"బడికిపోయి వణ్ణం తిన్నారా లేదురా?" అంటూ యిటు తిరిగిన ఆమె నన్ను చూస్తూనే ఒక్కసారిగా లేచి నిలబడి కట్టుకున్న పాత ముతక చేనేత చీర కొంగును భుజం చుట్టూ కప్పుకుంది.

"అమ్మా! మన శంకర్మం మాట్టారి స్నేహితులంట. నిన్ను సూడాలని వచ్చారు." అన్నాడు చిన్నోడు.

పెద్దోడు గోడవారగా ఉన్న ఫైబర్ కుర్చీ తెచ్చివేశాడు.

"నువు తల తుడుచుకుని ఉన్న పళాన వెళ్ళి మీ శంకరం మాష్టారిని నేను యిక్కడకు రమ్మన్నానని చెప్పు." అన్నాను.

"అలాగేనయ్యా!" అంటూ రెండోవాడు అలాగనే పరుగెత్తేశాడు.

"మీరు కూసోండి బాబూ!" అరేయ్ నువ్వెల్లి టీ అట్రా!" నేను వద్దనే లోగానే పెద్దవాడు తల్లిమాట వింటూనే తుర్రుమన్నాడు.

"నీ పేరు?"

"లచ్చమ్మ."

"ఏం చేస్తున్నావ్?"

"మా మావ వూళ్లో అందరు కుర్రోల్ల స్నేహం చేసి చెడిపోయాడు బాబు. ఆడినిచ్చిమనువు సేసేరు. ఆడికి ఎయిడ్స్ జబ్బు ఉందంట. అది నాకూ అంటుకుందంట.

అంతుకని ఏ పని సేద్దావన్నా ఎవరూ నన్ను పనిలోకి ఎట్టుకోవట్లేదు బాబు. పైగా అదేదో మాయదారి జొరం వచ్చి కృంగదీస్తావుంటే మంచంలో పడి ఉంటన్నాను. ఆ యిద్దరు ఎదవలకి ఓ అచ్చరం ముక్కొత్తే ఏ సిన్న పని సేసుకుని బతుకుతారని ఆశ. నా జబ్బు నా పిల్లలకీ సోకిందంట. ఆ ఎర్రి వెదవలకీ యిసయం తెలీదు. సిన్నతనం. రోజూ శంకరం మాట్టారుగారు వచ్చి తీపి మాత్తర్లిచ్చి ఎల్తారు. యిదండి బాబు మా బతుకు. బతికుండీ ఎవరికీ ఉపయోగం లేని బతుకై నాది బాబు!" అంటూ కళ్ళనీళ్ళెట్టుకుందామె.

"బాధపడకు లచ్చమ్మా! నీ బిడ్డలు బాగా చదువుకోవాలి. అంతేగా. పైగా ఈవేళ ఎయిడ్స్ వచ్చినంత మాత్రాన మనిషి వెంటనే చచ్చిపోడు. నువు ధైర్యం తెచ్చుకుని పిల్లలకు నీకు చేతనైనంతవరకూ తెలిసేలా చెప్పు. వాళ్ళే తెలుసుకుంటారు." అన్నాను నేను.

అంతలోనే శంకరంతో చిన్నాడు; వారి వెనుక పెద్దాడు రెండు టీగ్లాసులతో లోనికొచ్చారు. చెరో టీ గ్లాసు అందుకున్నాం.

"యిదేమిటి శేఖరం యిక్కడకి వచ్చారు?" ఆశ్చర్యపోతూ అడిగాడు శంకరం కుక్కిమంచంలో కూలాడుతూ.

(మిగతా 12వ పేజీలో)

# మెరుపు లీనే ముత్యాలు

వజ్రం, వైఢూర్యం, మరకతం, కెంపు, నీలం, పుష్యరాగం, గోమేధికం, పగడం, ముత్యం ఇవి నవ రత్నాలు. వీటిలో కొన్ని ప్రకృతిలో భూగర్భ సహజ సంపదలుగా లభిస్తే పగడం, ముత్యం మాత్రం ప్రాణుల నుండి లభిస్తాయి.


స్వాతివాన మొదటి చినుకు ముత్యపు చిప్పలో పడి ముత్యంగా తయారవుతుందని కొంతమంది నమ్మకం. ఇది నిజం కాదు.

సముద్రంలో ఉండే లామెల్లీ బ్రాంకియేట్‌లన బడే ఆల్చిప్పల ద్వారా ముత్యం తయారవుతుంది. మంద స్వభావం గల ఈ ప్రాణి సముద్రం నీటిలో అడుగున తన చుట్టూ ఆల్చిప్ప నిర్మించుకుని జీవిస్తూ ఉంటుంది.

అనేక ప్రకృతి ప్రక్రియల కారణంగా ఇసుక రేణువు లేదా పరాయి పదార్థం ఆల్చిప్పలోని ప్రాణిలోకి చొరబడుతుంది. ఈ పరాయి పదార్థం ఆ ప్రాణికి విపరీతమైన బాధ కల్గిస్తుంది. ఈ బాధ నుండి విముక్తి పొందేందుకు ఆ ప్రాణి 'నాకై' అనే ద్రవాన్ని స్రవింపజేస్తుంది. ఇది ఇసుక రేణువు చుట్టూ పేరుకుంటుంది. దానినే ముత్యం అంటారు.

ఆల్చిప్పలోని ప్రాణి శరీరంలోకి పరాయి పదార్థం ప్రవేశిస్తే ముత్యం తయారవుతుందని గ్రహించిన ఒక జపనీయుడు కృత్రిమంగా ముత్యాలను తయారుచేసే పద్ధతిని రూపొందించాడు. అతని పేరు కొకి చీమకి మోటో.

సముద్రపు ఆల్చిప్పలు, మంచినీటి ఆల్చిప్పలు కూడా ముత్యాలు తయారు చేస్తాయి. సముద్రపు ఆల్చిప్పలు తయారుచేసే ముత్యాలు నాణ్యంగా వుంటాయి. అందుకే వాటికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది.



ముత్యంలో కాల్షియం, కార్బనేటు, నీరు, అంగారక పదార్థం ఉంటాయని తెలుసుకున్నారు. స్వల్ప పరిణామంలో నీరు ఉండడంవల్ల ముత్యం మెరుస్తున్నట్లు కన్పిస్తుంది. ముత్యం తయారయినపుడు దానికి రంధ్రం ఉండదు.

ఆభరణాలు తయారుచేసేటప్పుడు వాటికి రంధ్రాలు ఏర్పరుస్తారు. ఒకప్పుడు ముత్యాలు చాలా ఖరీదు ఉండేవి. 1917లో ఒక అమెరికన్ కంపెనీ రెండు పేటల ముత్యాల హారాన్ని పది లక్షల అమెరికన్ డాలర్లకు అమ్మింది. అంటే అప్పట్లో వాటికి ఎంత విలువ ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

కొకిచీమకిమోటో సహజంగా ముత్యాలు ఎలా ఏర్పడతాయో 1890లో ఒక వస్తు ప్రదర్శన శాలలో చూశాడు. ముత్యాలను కృత్రిమంగా తయారుచేసే పని ప్రారంభించాడు. అతడి పరిశోధనలు కలిసి రాలేదు. సముద్ర తీరాన ఏర్పాటుచేసిన చెరువులో ఆల్చిప్పల్ని వేసి ముత్యాల సాగు చేపట్టాడు. అయితే పెద్ద అలలు వచ్చినప్పుడు ముత్యపు చిప్పలన్నీ కొట్టుకుపోయేవి. కొన్ని మాత్రం ఒక గుంటలో చిక్కుకున్నాయి. అందులో ఒక ముత్యపు చిప్పను పగులగొట్టి చూశాడు. అర్ధ గోళాకారంగా ముత్యం కన్పించింది. ఎంత కృషిచేసినా పూర్తి గోళాకారపు ముత్యాలు తయారుచేయలేకపోయాడు. హెమైన్ అనే ఒక చేతి పని కార్మికుడు గోళాకారంగా ఉండే కృత్రిమ ముత్యాలు తయారుచేయగలిగాడు. అయితే శాస్త్రీయంగా కృత్రిమ ముత్యాలను తయారుచేసే విధానాన్ని రూపొందించింది. సాగర జీవ శాస్త్రవేత్త బినిషికొనా. ఈ శాస్త్రవేత్త రూపొందించిన విధానంతోనే ఈనాడు కృత్రిమ ముత్యాలు తయారుచేస్తున్నారు.

**- సి.వి.సర్వేశ్వరశర్మ**

---

**(9వ పేజీ తరువాయి)**

“చెప్తాను. పిల్లలూ మీ యిద్దరూ అలా కూర్చోండి” అన్నాను.

వారిద్దరూ నేల మీద మఠం వేసుకుని కూర్చున్నారు.

“మీ యిద్దరూ చదువు మానేసి నీళ్ళలో దూకి డబ్బు సంపాదిస్తున్నారు కదా! బడి మానేస్తే చదువెలా వస్తుంది?” అడిగాను.

తప్పు చేసి వాళ్ళలా శంకరంకేసి చూసి తల దించుకున్నారు వారిద్దరూ.

“నిజం చెప్పండి. మీ అమ్మ ఎదురుగా ఉంది. నిజంగా మీకు చదువుకోవాలని ఉందా?”

“మా అమ్మ మీద ఒట్టు సారూ! బాగా సదూకుని పెద్ద ఉద్యోగంసేసి అమ్మకి వైద్దెం సేయించాలనుంది. కానీ అంతవరకు ఎలా ఉండగలం? అమ్మకేమో జొరం. అమ్మ లేకపోతే మాకు ఇంకెవరున్నారు సారు?” అన్నాడు పెద్దోడు బేలగా.

“అందుకని నీళ్ళలో దూకి గోదారితల్లి డబ్బులు తీసేసుకుంటే ఆ యమ్మ బాధపడి నిన్ను శపించదా?”

“శపిత్తదా అంటే ఏంటి సారూ?” చిన్నోడు అడిగాడు.

“వీడికన్నీ ధర్మసందేహాలే. శాపం అంటే తిట్టురా! నీ దగ్గర ఉన్న డబ్బులు ఎవరైనా లాక్కుంటే బాధపడతావే! అలాగే గోదారమ్మ డబ్బులు లాక్కోడం తప్పు కాదా!”

అన్నదమ్ములిద్దరూ ఒకరిమొహాలు ఒకరు చూసకున్నారు.

‘తప్పేసారూ!”

“ఆ డబ్బుల్తో మీ అమ్మకి వైద్యం చేయిస్తే బాగవుతుందా?” అడిగాను నేను.

“ఊహు!” అని తల అడ్డంగా ఊపారు వారు.

“మరి అమ్మకి తగ్గాలంటే ఏం చేయాలి?”

“బాగా సదూకుని ఏదైనా ఉద్దోగం సేయాలి!”

“మరి యికనుంచి మానకుండా బాగా చదువుకుంటామని అమ్మమీద ఒట్టేయండి మీ సారు చేతుల్లో!” అన్నాను.

“సారూ! అమ్మకేమన్నా అయితే...” పెద్దాడు సందేహపడ్డాడు భయంగా.

“అమ్మకేమీ అవకూడదనుకుంటే శ్రద్ధగా బడికి రండి. బాగా చదువుకోండి” అన్నాడు శంకరం.

“అలాగే. అమ్మ మీద ఒట్టుగా బాగా సదూకుంటాం. ఏరోజూ బడి మానం.”

“మరి అమ్మ అంటే ఎవరు?”

“తల్లి దైవము. తండ్రి ధనము. గురువును మించిన దైవం లేదు.” మాకురోజూ స్కూల్లో యివి సెప్తారు సారూ!” అన్నారు వాళ్ళిద్దరూ.

నేను శంకరం వైపు తిరిగాను.

“శంకరం! ఈనాటి వ్యవస్థలో ఉపాధ్యాయులం కావడం మన అదృష్టం. నువు ప్రాథమిక పాఠశాలకైతే, నేను ఉన్నత పాఠశాలకి, యింత యాదృచ్ఛికంగా నిన్ను కలుస్తానని నేను అనుకోలేదు. మా అమ్మగారు చెప్పినట్లు అనుసరించదలుచుకుని ఈ ప్రయాణం ప్రారంభించాను.

నా ఉద్యోగం వచ్చినప్పటి నుంచి నెలకు వంద రూపాయల చొప్పున పోస్టల్ ఆర్‌డి కట్టాను. నేను తీర్థ యాత్ర చేయవలసి వచ్చినపుడు ఆ సొమ్మును నిత్యాన్న దాన పథకం నిర్వహించే కోవెలకు విరాళంగా యివ్వాలనుకున్నాను. కానీ మా అమ్మగారు మానవ సేవే మాధవ సేవ. దైవత్వానికంటే మానవత్వానికి విలువ యిమ్మని చెప్పారు.

మనిషి జీవితానికి 'అమ్మ' ఒక జీవనది. ఆ జీవ నది అలల మీద బ్రతుకు నావను నడిపించుకునే పిల్లలం మనం. ఆమెలోని ప్రతీ అణువు అమృతం చిలికిస్తుంది. ప్రతీ మాట మనని చుక్కానిలా నడిపిస్తుంది.

అందుకే ఆ స్వామివారి అన్నదాన పథకానికి తెచ్చిన సొమ్మును ఈ 'అమ్మ'ను బ్రతికించుకోవాలనుకునే యీ పిల్లల చదువు నిమిత్తం నీకు అందచేస్తున్నాను. వారు ఎంతవరకు చదువుకోగలరో అంతవరకు యీ సొమ్మును ఖర్చుచేయి. ఒకవేళ చాలకపోతే నాకు ఉత్తరం వ్రాయి. కొనసాగుతున్న నా ఆర్.డి.ని కాన్సిల్ చేసి మరీ పంపిస్తాను. యీ ఒక్క సహాయం చేసిపెట్టు.

ఒక ప్రముఖ శివక్షేత్రంలో ఒక మంచి పని చేశానన్న తృప్తి నాకు మిగలనివ్వు. సరేనా?” అన్నాను బేగ్ తెరిచి పాతికవేలు అందిస్తూ.

నీళ్ళు నిండిన కళ్ళతో శంకరం నన్ను గాఢంగా హత్తుకున్నాడు.

“నాకు యిదంతా కలగా ఉంది శేఖరం. అమ్మ విలువ తెలిసిన వాడివి నువ్వు. నిన్ను కన్నతల్లి నిజంగా జీవనదే. నీ కోరిక సిద్ధించేలా నావంతు కృషి చేస్తానని నీకు నేను నమ్మిన శివుని సాక్షిగా హామీ యిస్తున్నాను.” అన్నాడు నా చేతుల్లో చెయి వేసి ప్రమాణం చేస్తున్నట్టుగా!

కోవెల తెరచినట్టుగా దూరం నుండి గుడి గంటలు తదేకంగా వినిపించసాగాయి. ★